ప్రజల చేతిలో

www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

గురువారం | జులై 23, 2026 | సంపుటి : 7 | సంచిక : 48 | పేజీలు : 2



## ఉగ్రప్రభా అలంకరణలో భద్రకాళీ మాత

■ ఎనిమిదో రోజుకు చేరిన శాకంభరీ ఉత్సవాలు

**వరంగల్, ఆయుధం:** శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4గంటలకు నిత్యాహ్నికం పూర్తిచేసిన పిమ్మట అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి ఉగ్రప్రభా గాను షోడశీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని త్వరితామాత గాను అంకరించి పూజారాధనలు నిర్వహించారు. అమ్మవారి విభూతియైన ఈ ఉగ్ర ప్రభా మాతకే ప్రత్యంగిరా అను నామాంతరం కూడా ఉంది. ప్రళయకాలమునందలి అగ్నితో సమములగు శరీరకాంతులతో ప్రకృతిని, ప్రాణికోటిని బాధించే శక్తులను ఈ మాత నుండి ప్రజ్వల్లిల్లే ప్రళయకాలాగ్ని వంటి జ్వాలలు సంహరిస్తాయి. పాడిపంటలకు కీడు తలపెట్టు అసురీశక్తులను నశింపజేస్తుంది. జన్మజన్మాంతరములనుండి సంక్రమించిన



పాపం వల్ల భూతగణముచే పీడింపబడుచున్న జీవుల పాపమును నశింపజేసి మనుష్యులను పీడిస్తున్న అసురీ శక్తులను దూరం చేసి కాళికా భక్తులకు వరాలిస్తుంది ఈ మాత. సకల విధముల అభయమును ప్రసాదించి భక్తుల మనోరథములీడేరుస్తుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.










# సవాళ్లను అధిగమిస్తూ.. ముందుకు

## రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి

■ తెలంగాణను విద్యుత్ రంగంలో దేశానికి ఆదర్శంగా నిలుపుతాం
■ దేశంలోనే తొలి 'ఎలక్ట్రిసిటీ అంబులెన్స్', 1912 హెల్ప్ లైన్ కు కృత్రిమ మేధ
■ హనుమకొండకు రూ.56 కోట్ల అభివృద్ధి వరాలు
■ సబ్‌స్టేషన్లు, నూతన కార్యాలయ భవనాలు, కార్పొరేట్ మౌలిక వసతుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**హనుమకొండ, ఆయుధం:** 'ఎల్ నినో' ప్రతికూల ప్రభావంతో వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ డిమాండ్.. జలాశయాల్లో నీటి లభ్యత తగ్గి జలవిద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది.. ఒకేసారి సుమారు 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని *టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం (విద్యుత్ భవన్)*లో రూ.56 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. వాజ్‌పేయి కాలనీ, ఆర్ అండ్ బీ క్వార్టర్స్, విద్యుత్ నగర్, వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు, హనుమకొండ నూతన సర్కిల్ కార్యాలయ భవనం, టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఐదో అంతస్తు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

అనంతరం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని, టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అత్యాధునిక సమావేశ మందిరాన్ని ప్రారంభించారు.

తదనంతరం జరిగిన సమీక్ష సమావేశంలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ పనితీరు, వినియోగదారులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు 70 కొత్త 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు, 31,448 కిలోమీటర్ల కొత్త విద్యుత్ లైన్లు, 35,736 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే కాలంలో 7.72 లక్షల కొత్త ఎల్టీ కనెక్షన్లు, 771 హెచ్‌టీ కనెక్షన్లు విడుదల చేయగా, 1,656 గ్రామాలు, 11.16 లక్షలకు పైగా వినియోగదారులు ప్రత్యక్షంగా లబ్ధి పొందినట్లు వెల్లడించారు.

2026 మార్చి 27న తెలంగాణలో నమోదైన 18,548 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్, 341.08 మిలియన్ యూనిట్ల రోజువారీ విద్యుత్ వినియోగాన్ని ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అదే రోజు టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో 6,574 మెగావాట్ల పీక్ డిమాండ్, 104.36 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా నిర్వహించినట్లు వెల్లడించారు. గాలివానల కారణంగా దెబ్బతిన్న 7,267 విద్యుత్ స్తంభాలు, 204 డీటీఆర్ నిర్మాణాలను పునరుద్ధరించినట్లు తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, బలహీన స్తంభాల మార్పిడి, వరద ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల ఎత్తు పెంపు, 860 ట్రాన్స్‌ఫార్మర్ల ప్లింత్‌ల ఎత్తు పెంపు వంటి ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, సాధారణంగా వర్షాకాలంలో 11 వేల మెగావాట్లుగా ఉండే విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు పెరగడం, మరోవైపు జలవిద్యుత్ ఉత్పత్తి 2,000 మెగావాట్లు తగ్గిపోవడం విద్యుత్ పంపిణీ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి సృష్టించినప్పటికీ, విద్యుత్ శాఖ (..:: మిగతా 2లో..)



## కాంగ్రెస్ నియంతృత్వానికి, ద్వంద్వ వైఖరికి నిదర్శనం

### బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.వన్నాల వెంకటరమణ

**హైదరాబాద్, ఆయుధం:** ఒకవైపు ఢిల్లీలో ప్రజాస్వామ్యం ముసుగులో విధ్వంసాలు సృష్టిస్తూ, రాష్ట్రంలో మాత్రం పోలీసుల అండతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడటం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వానికి, ద్వంద్వ వైఖరికి నిదర్శనం అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.వన్నాల వెంకట రమణ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం నుండి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయం(గాంధీ భవన్) వరకు నిరసన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తో కలిసి డాక్టర్ వన్నాల వెంకట రమణ పాల్గొన్నారు. ఢిల్లీలోని ప్రధాని నివాసం ను ముట్టడించిన కాంగ్రెస్ పార్టీ.. ఇక్కడ తెలంగాణలో తమ తప్పును ఎండగడుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత నీచమైన వ్యవహారంగా మారిందని విమర్శించారు. ఇది ముమ్మాటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వ పిరికిపంద చర్య అని అన్నారు. పోలీసు నిర్బంధాలతో, అక్రమ అరెస్టులతో బిజెపి నాయకులను, కార్యకర్తలను ఎవరూ భయపెట్టలేరని... కాంగ్రెస్ అప్రజాస్వామిక, అరాచక విధానాలపై బిజెపి పోరాటం ఆగదు అని అన్నారు. ఈ నిరసన కార్యక్రమం లో శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి, పాల్వాయి హరీష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవ లక్ష్మి నర్సయ్య, అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభ, బీజేపీ నాయకులు, మహిళ నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'నీట్' లీక్‌పై పార్లమెంట్ ముందు ఆందోళన

■ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: ఎంపీ డా. కడియం కావ్య




**ఢిల్లీ, ఆయుధం:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పార్లమెంట్ ఆవరణలో విపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తులు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఘటనలను సహించబోము అన్నారు. పేపర్ లీక్‌లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారి సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది" అని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, వారి భవిష్యత్తు పరిరక్షణ కోసం పార్లమెంట్ లోపల, బయట తమ పోరాటం కొనసాగుతుందని ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు.



## కాంగ్రెస్ అరాచకాలపై బీజేపీ పోరాటం ఆగదు

■ ఢిల్లీలో కాంగ్రెస్ వీధి నాటకాలకు బీజేపీ దీటైన జవాబు
■ బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ
■ అశోక చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం 2 లో

## 24న తెలంగాణలో విద్యాసంస్థల బంద్

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ వ్యాప్తంగా ఈనెల 24న విద్యాసంస్థల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ సంఘాలు డిమాండ్ చేశాయి. ఢిల్లీలో యువతపై జరిగిన పోలీసుల లాఠీఛార్జ్‌ను ఆయా సంఘాల నేతలు ఖండించారు. బంద్‌కు అన్ని విద్యాసంస్థలు సహకరించి విజయవంతం చేయాలని ఎన్‌ఎస్‌యూఐ తెలంగాణ అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి కోరారు. విద్యార్థుల కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాలన్నారు.

■ దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ప్రతిపక్ష పార్టీగా గుర్తించడం లేదు
■ విద్యార్థుల కోసం కాదు, కాక్రోచ్ పార్టీకి పోటీగా కాంగ్రెస్ నిరసనలు
■ మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి ధర్నాలో పాల్గొనడం సిగ్గుచేటు
■ వరంగల్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం..
■ కాంగ్రెస్ అరాచకాలపై బీజేపీ పోరాటం ఆగదు
■ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్




అధికారంలో ఒకలా.. ప్రతిపక్షంలో మరోలా

## కాంగ్రెస్‌వి పచ్చి అవకాశవాద రాజకీయాలు

**వరంగల్, ఆయుధం:** అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొకలా మాట మార్చి ప్రజలను ఏమార్చడం ఒక్క కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతకైనా దిగజారుతుందని ఆయన విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ తీరుకు నిరసనగా వరంగల్ చౌరస్తాలో బీజేపీ శ్రేణులు భారీ నిరసన చేపట్టారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఏదైనా ఎలీనినో ఎఫెక్ట్ తో వర్షాలు పడక రైతులు ఇబ్బందులు పడుతుంటే కనీసం సాగునీళ్లు అందించాలని సోయిలేని కాంగ్రెస్ మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి దద్దమ్మల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ శ్రేణులు అరాచక మూకల్లా ప్రవర్తించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఒకవైపు దేశ రాజధానిలో ప్రజాస్వామ్యం ముసుగులో విధ్వంసాలు సృష్టిస్తూ, మరోవైపు రాష్ట్రంలో మాత్రం పోలీసుల అండతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూడటం కాంగ్రెస్ పార్టీ నియంతృత్వానికి, ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ఇటువంటి అప్రజాస్వామిక, అరాచక విధానాలపై భారతీయ జనతా పార్టీ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, రాష్ట్ర నాయకులు గందె నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, బైరి నాగరాజు, జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, గోకే వెంకటేష్, మాచర్ల దీన్ దయాళ్, బైరి శ్యాంసుందర్, కూచన క్రాంతి కుమార్, మాదాసు రాజు, టేకుమట్ల రేణుక, పైర్ద ఆనంద్, అంకాల జనార్ధన్, నోముల రతన్, కర్నె రవీందర్, షేర్ల అనిల్ కుమార్, కొంతం సంగీత్, మండల అధ్యక్షులు సీతా నాగరాజు, అపురూప రజనీష్, బిజెపి నాయకులు మార్త ఉషారాణి, రేపల్లె స్వర్ణజ, అల్లి అజయ్, ముద్దసాని కృష్ణ, మెంగాని నరేష్, ముత్తినేని శ్రీనివాస్, మోహనా చారి, మరియు బీజేవైఎం, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి

■ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
■ యూత్ కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ
■ నల్ల బ్యాడ్జీలతో నిరసన... మోదీ దిష్టిబొమ్మ దహనం

**పరకాల, ఆయుధం:** ఏఐసీసీ అగ్ర నాయకులు, లోక్ సభ ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ, ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ పరకాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మదాసి శ్రీధర్ ఆధ్వర్యంలో పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య విలువలను కాలరాసే చర్య అని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని అణిచివేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుడిని అరెస్టు చేయడం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా అనేక మంది విద్యార్థులు నష్టపోయారని పేర్కొంటూ, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసు బలప్రయోగం చేయడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్, పరకాల టౌన్ అధ్యక్షులు ఒంటేరు శ్రావణ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అరాచకాలపై బీజేపీ పోరాటం ఆగదు

- ఢిల్లీలో కాంగ్రెస్ వీధి నాటకాలకు బీజేపీ దీటైన జవాబు!
- బీజేపీ నాయకురాలు రావు పద్మ
- హనుమకొండ అశోక చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

**హనుమకొండ, ఆయుధం:** దేశ రాజధాని ఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసం వద్ద కాంగ్రెస్ శ్రేణులు చేసిన వీధి నాటకాలకు, సృష్టించిన అరాచకాలకు దీటైన జవాబు ఇస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి హెచ్చరించారు. అరాచకాలు సృష్టించడం కాంగ్రెస్ నైజమైతే, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం బీజేపీ విధానమని స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న దిగజారుడు వీధి రాజకీయాలను, కుట్రలను క్షేత్రస్థాయిలో అంతే కఠినంగా ఎదుర్కొంటామని తేల్చిచెప్పింది.

కాంగ్రెస్ పార్టీ తీరుకు నిరసనగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండలోని అశోక చౌరస్తాలో బీజేపీ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రూ. 12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఢిల్లీలో ధర్నాల్లో పాల్గొనడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు విద్యార్థుల కోసం కాకుండా రాజకీయ స్వార్థం కోసమే నిరసనలు చేస్తున్నారని మండిపడ్డారు.

అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొకలా మాట మార్చి ప్రజలను ఏమార్చడం ఒక్క కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందని, స్వార్థ రాజకీయాల కోసం కాంగ్రెస్ ఎంతకైనా దిగజారుతుందని ధ్వజమెత్తారు. ఢిల్లీలో ప్రధాని నివాసం వద్ద అరాచక మూకల్లా ప్రవర్తిస్తూ విధ్వంసాలు సృష్టిస్తున్న కాంగ్రెస్, ఇక్కడ తెలంగాణలో మాత్రం పోలీసుల అండతో ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని, ఇది వారి ద్వంద్వ వైఖరికి, నియంతృత్వానికి నిదర్శనమని అన్నారు. రాహుల్ గాంధీ ఎన్ని డ్రామాలు ఆడినా దేశ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ఇటువంటి అప్రజాస్వామిక, అరాచక విధానాలపై భారతీయ జనతా పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, డివిజన్, నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద ప్రజలు, మహిళా సంక్షేమానికి పెద్ద పీట

- వేలేరు ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తా
- గండి రామారం ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసి వేలేరు కు గోదావరి జలాలు తీసుకువస్తా
- పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణను దోచుకున్నారు
- పంపకాల్లో విభేదాలు వచ్చి కవిత బయటకు వచ్చింది
- హరీష్ రావు అవినీతి వల్లే కాళేశ్వరం కుంగిపోయిందని కవిత ఆరోపిస్తుంది
- అధికారం కోల్పోయామనే అక్కసుతోనే బీఆర్ఎస్ వ్యాఖ్యలు
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వేలేరు, ఆయుధం:** వేలేరు మండలాన్ని అన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంతో పాటు వేలేరు మండల రైతులకు గోదావరి జలాలతో రెండు పంటలకు సాగు నీరు అందిస్తానని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. వేలేరు మండలం మద్దెలగూడెం గ్రామంలో రూ.43.40లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వేలేరు మండల కేంద్రంలో రూ. 45లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, రూ.22.30లక్షలతో నిర్మించిన పాఠశాల ప్రహరీ గోడ, రూ.10లక్షలతో నిర్మించిన వీవో భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.... వేలేరు మండల కేంద్రంలో నెల రోజులలలో ఎమ్మార్వో, ఎంపిడివో కార్యాలయాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వారం రోజుల క్రితమే రూ.2కోట్ల 20లక్షలతో తహసీల్దార్ కార్యాలయం, రూ.2 కోట్లతో ఎంపిడివో కార్యాలయాల భవనాలు మంజూరు అయ్యాయని తెలిపారు. గండి రామారం ఎత్తిపోతల పనులు పూర్తి చేసి వేలేరు మండలంలోని అన్ని గ్రామాలకు సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. ఒక పెద్ద మనిషి అయన గ్రామానికి నీళ్లు వచ్చే పనులు మాత్రమే చేసుకొని మిగతా పనులను వదిలేశాడని విమర్శించారు. 30ఏళ్లలో వేలేరు ఆశించిన స్థాయిలో అభివృద్ధి కాలేదని కానీ నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈ రెండున్నర ఏళ్లలోనే 2కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశానని.. అలాగే 50ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చానని తెలిపారు.

మద్దెలగూడెం గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడు మద్దెలగూడెం గ్రామంలో గంగిరెద్దుల వాళ్లకు ఇండ్లు ఇచ్చానని, పీచర నుండి కొమ్ముగుట్ట వరకు బిటీ రోడ్డుతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. మళ్ళీ 20ఏళ్ల తర్వాత నేను ఎమ్మెల్యే అయిన తర్వాతనే మద్దెలగూడెం గ్రామానికి 20 ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్లు వచ్చాయని అన్నారు. త్వరలోనే పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం, 3కోట్లతో పీచర నుండి కొమ్ముగుట్ట వరకు బిటీ రోడ్డు అభివృద్ధి పనులు చేయిస్తానని 6నెలలలో రోడ్డు పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. రెండవ విడతలో మరో 20ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, రెండు ఏళ్లలోనే 7లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డ్ సృష్టించిందని కొనియాడారు.

ఎల్ నీనో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రైతులు వాతావరణ పరిస్థితులు అర్థం చేసుకొని ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా సాధ్యమైనంత వరకు గోదావరి జలాలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రానున్న రోజులల్లో త్రాగు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని సాగు నీరు అందించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే కొంత మంది మాత్రం ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని అన్నారు. 10ఏళ్ళు అధికారంలో ఉండి తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. దోచుకున్న సొమ్ము పంపకాలలలో విభేదాలు వచ్చి కవిత బయటకు వచ్చిందని తెలిపారు. ఇప్పుడు కల్వకుంట్ల కుటుంబ సభ్యురాలే 10ఏళ్ళ అధికారంలో అవినీతి ద్వారా వచ్చిన 1400కోట్ల బిఆర్ఎస్ పార్టీ ఫండ్ ఉద్యమకారులకు పంచాలని, హరీష్ రావు అవినీతి వాళ్లే కాళేశ్వరం కుంగిపోయిందని స్వయంగా కవితే ఆరోపిస్తుందని విమర్శించారు. మళ్ళీ వాళ్లే అధికారం కోల్పోయామనే అక్కసుతో రాష్ట్ర ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని, బిఆర్ఎస్ చెప్పే మాయ మాటలు నమ్మవద్దని ప్రజలను, రైతులను కోరారు. పేదల ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బిల్లా యాదగిరి, హన్మకొండ మనోజ్, తహసీల్దార్, ఎంపిడివో, హౌసింగ్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఇతర అధికారులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సవాళ్లను అధిగమిస్తూ.. ముందుకు

(మొదటి పేజీ తరువాయి..)

అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళికలు, అంకితభావంతో పనిచేయడం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశామని తెలిపారు.

ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని కాళేశ్వరం, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాలు, వర్షాభావం కారణంగా రైతులు అధికంగా బోర్‌వెల్లను వినియోగించడం వల్ల పెరిగిన విద్యుత్ అవసరాలను కూడా ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిందన్నారు.

రాష్ట్రంలో 'పవర్ కట్' అనే పరిస్థితి లేదని, ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ స్తంభాలు, లైన్లు దెబ్బతిన్నప్పుడు మాత్రమే తాత్కాలిక అంతరాయం ఏర్పడుతుందని, దానిని పవర్ కట్‌గా భావించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



### దేశంలోనే తొలి 'ఎలక్ట్రిసిటీ అంబులెన్స్' సేవలు

దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఎలక్ట్రిసిటీ ఆంబ్యులెన్స్ సేవలను ప్రారంభించినట్లు ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. గతంలో వైద్య సేవల్లో 108 అంబులెన్స్ సేవలు అందించిన తరహాలోనే, ఇప్పుడు విద్యుత్ అత్యవసర సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ సేవల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, నిచ్చెనలు, అవసరమైన పరికరాలు, నిపుణులైన సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయగానే కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత వ్యవస్థ ద్వారా సమాచారం వెంటనే సంబంధిత బృందానికి చేరి, అత్యంత వేగంగా సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తుందని వివరించారు.

### లైన్‌మెన్ల సంక్షేమానికి..

విద్యుత్ వ్యవస్థకు వెన్నెముకైన లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.1.20 కోట్ల బీమా సౌకర్యం కల్పించామని, సురక్షితంగా విధులు నిర్వహించేందుకు అవసరమైన సేఫ్టీ కిట్లు, యూనిఫారాలు అందిస్తున్నట్లు చెప్పారు.

గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు ఏటా రూ.14 వేల కోట్ల సబ్సిడీని కూడా ప్రభుత్వం విడుదల చేస్తోందని తెలిపారు.

రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా సౌర (సోలార్), పవన (విండ్) విద్యుత్ ఉత్పత్తి విస్తరణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులను సూచించారు. విద్యుత్ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందిస్తోందని ఆమె అభినందించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించిన ప్రణాళికలు, సాంకేతిక సంస్కరణలు ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ టి. వెంకన్న, వరంగల్ జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) నిఖిల, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, పాల్గొన్నారు.



## విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత

- పాఠశాల, కళాశాల బస్సులపై తనిఖీ లు

**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అదనపు డీసీపీ (ట్రాఫిక్) రాయల ప్రభాకర్ రావు, ఏసీపీ (ట్రాఫిక్) టి.సత్యనారాయణ ఆదేశాల మేరకు కాజీపేట ట్రాఫిక్ పోలీసులు ఆదాలత్ సెంటర్ వద్ద పాఠశాల, కళాశాల బస్సులపై ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ (డీడీ) తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 28 స్కూల్, కాలేజ్ బస్సులను పరిశీలించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు కాజీపేట ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ వెంకన్న తెలిపారు. పాఠశాల యాజమాన్యాలు, బస్సు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## నేడు తాగునీటి సరఫరా అంతరాయం

**వరంగల్, ఆయుధం:** కరీంబాద్ ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీకి మరమ్మతులు చేపట్టేందుకు దేశాయిపేట ఫిల్టర్ ప్లాంట్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్‌బాబు తెలిపారు. దీని కారణంగా గురువారం దేశాయిపేట ఫిల్టర్ పరిధిలోని ప్రాంతాలకు తాగునీటి సరఫరా పాక్షికంగా ప్రభావితమవుతుందని పేర్కొన్నారు. మరమ్మతు పనులను అత్యవసరంగా చేపట్టి వీలైనంత త్వరగా పూర్తి చేసి సాధారణ తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేశాయిపేట ఫిల్టర్ పరిధి ప్రాంతాల్లోని ప్రజలు ఈ తాత్కాలిక అసౌకర్యాన్ని గమనించి జీడబ్ల్యూఎంసీకి సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్‌బాబు విజ్ఞప్తి చేశారు.



## ములుగులో అత్యాధునిక కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

**ములుగు, ఆయుధం:** గిరిజన ఆరోగ్య సేవలు, వైద్య పరిశోధనలను మరింత బలోపేతం చేసే దిశగా ములుగు జిల్లాలో అత్యాధునిక కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావును ఆయన ఛాంబర్‌లో బీబీనగర్ ఎయిమ్స్ డీన్ రిసెర్చ్ డా. రాహుల్ నరాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి, ములుగు జిల్లాలో సమ్మక్క-సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సహకారంతో "సెంటర్ ఫర్ ట్రైబల్ హెల్త్ అండ్ అకడమిక్ ఎక్సలెన్స్" ఏర్పాటు చేసే ప్రతిపాదనపై చర్చించింది.

ఈ సందర్భంగా ప్రతిపాదిత కేంద్రం లక్ష్యాలు, గిరిజన ఆరోగ్య సేవల బలోపేతం, వైద్య పరిశోధనలు, అకడమిక్ సహకారం, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతిపాదిత కేంద్రం ద్వారా గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన ఆరోగ్య సేవలను మరింత చేరువ చేయడం, తలసీమియా, రక్తహీనత, టెలిమెడిసిన్ సేవలను విస్తరించడం, సికిల్ సెల్ అనీమియా, మలేరియా, డెంగ్యూ, క్షయవ్యాధి, స్క్రబ్ టైఫస్, జునోసిస్ వ్యాధుల వంటి, గిరిజన ప్రాంతాల్లో అధికంగా కనిపించే వ్యాధులపై ప్రత్యేక పరిశోధనలు నిర్వహించడం, గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, గిరిజన యువతకు ఆరోగ్య విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించడం, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ కల్పించడం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో వ్యాధుల పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తరించడం, ఎయిమ్స్ బీబీనగర్-సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య సేవలు, అకడమిక్ కార్యక్రమాలు, పరిశోధనలను విస్తరించే కార్యాచరణను రూపొందించడం ద్వారా ములుగు జిల్లాను గిరిజన ఆరోగ్య సేవలు, వైద్య పరిశోధనలు, ప్రజారోగ్య అధ్యయనాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డీఎంహెచ్‌వో డా. గోపాలరావు, ములుగు ఏరియా ఆసుపత్రి, ఏటూరునాగారం ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డా. చంద్రశేఖర్, డా.సురేష్, ఎయిమ్స్ వైద్య బృందం సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణకు కేంద్రం గుడ్‌న్యూస్

- ధాన్యం కొనుగోళ్లకు గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో అదనంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రబీకి సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. సవరించిన అంచనాల ప్రకారం సేకరణ మొత్తం 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలుకు నిర్ణయించింది. ధాన్యం కొనుగోళ్లు పెంచినందుకు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు.



## భూముల ఆక్రమణ దారులపై కేసులు నమోదు చేయాలి

- దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్.సునీత

వరంగల్, ఆయుధం: వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని భూములను గుర్తించాలని ఆ శాఖ సహాయ కమిషనర్ ఆర్.సునీత పేర్కొన్నారు. బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ, వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న డివిజన్ ఇన్స్పెక్టర్లు, ఈవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా అన్యాక్రాంతమైన భూముల గురించి, అర్చకులు అమ్ముకున్న భూముల గురించి చర్చించారు. సీసీఎల్ఏలో గుర్తించిన భూములను దేవాదాయ శాఖలో నమోదు చేయాలని, మండల ఇంచార్జి పరిధిలో ఉన్న భూముల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆ భూముల ద్వారా లీజు వసూలు చేయవలసినదిగా కోరారు. అనధికారికంగా కౌలు చేసుకుంటున్న కౌలుదారులనుండి కౌలు వసూలు చేయాలని అన్నారు. లేని యెడల ఆక్రమణ దారులను గుర్తించి వారిపై ఎండోమెంట్ ట్రిబ్యునల్లో కేసులు దాఖలు చేయాలని ఆదేశించారు.



## టెస్కో ద్వారా కొనుగోళ్లు చేపట్టాలి

- డిప్యూటీ సీఎం భట్టికి వినతి

ఈచేనేత ఉత్పత్తులు కార్పెట్లు, బెడ్ షీట్లు టెస్కో ద్వారా కొనుగోలు చేయుటకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసి, చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను చేనేత కార్మికులు కోరారు. బుధవారం వరంగల్ పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ సూచనలతో వరంగల్ కార్పెట్ బహూకరించి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ శాఖలకు అవసరమైన బెడ్డింగ్ మెటీరియల్ ఏకీకృత టెండర్ విధానం నుండి తొలగించి, యథావిధిగా టెస్కో సంస్థకు ఆర్డర్ ఇప్పించుట ద్వారా పేద చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. టెస్కోనుండి కొనుగోలు చేయు చేనేత ఉత్పత్తులకు 30% కూలీ రేట్లు పెంచినందుకు చేనేత సహకార సంఘాల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. చేనేత సహకార సంఘాల క్యాష్‌క్రెడిట్ ఋణ మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల అధ్యక్షులు ఎలుగం వెంకటమల్లు, సాంబయ్య, దువ్వల రాజేందర్, ఓం ప్రకాష్, వలుస కిరణ్, దామెర రాజ్ కమల్, దాసరి రాజశేఖర్, కొక్కుల సతీష్, గొండ శ్రీనివాస్, మండల సురేష్, రావుల రాజీవ్, బొల్లు సతీష్, నంబి మురళి, ఈగ శ్రీధర్, దేవర రాము, తుమ్మ రాము తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత డయాబెటిస్ క్యాంప్

- థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరీక్షలు

**హనుమకొండ, ఆయుధం:** చాపకింద నీరులా విస్తరిస్తున్న డయాబెటిస్ నిర్మూలనకు గాను లయన్స్ ఇంటర్నేషనల్ చేపట్టిన అంతర్జాతీయ సేవా కార్యక్రమంలో భాగంగా హనుమకొండ కాకాజీ కాలనీలోని అభయ హాస్పిటల్‌లో 'థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్' ఆధ్వర్యంలో బుధవారం ఉచిత డయాబెటిస్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో బాధితులకు ఉచితంగా డయాబెటిస్ పరీక్షలు, ల్యాబ్ టెస్టులు నిర్వహించి నివేదికలు అందించారు. అనంతరం ప్రముఖ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ లయన్ వైద్యం గౌతమ్ రోగులకు ఉచిత వైద్య సలహాలు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వైద్యం రాజగోపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత లయనిస్టిక్ సంవత్సరం (202627)లో భాగంగా ప్రతి బుధవారం ఉదయం 6:00 గంటల నుండి 9:00 గంటల వరకు ఉచిత డయాబెటిస్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్, రాపిడ్ డయాగ్నోస్టిక్స్, అభయ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఉచిత క్యాంప్ వివరాల కోసం 94921 87832 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ గంజి నరహరి, ట్రెజరర్ మార్త పాపయ్య, డీసీ ఫైనాన్స్ జూలూరి చంద్ర శేఖర్, మాజీ ప్రెసిడెంట్ పరికిపండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం – నియంతృత్వాన్ని తిప్పికొడదాం

**ఉప్పల్, ఆయుధం:** నీట్ పరీక్షల వ్యవహారంపై, ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా గాంధేయ మార్గంలో నిరసన తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడికి నిదర్శనం అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి హెచ్.ఆర్.మోహన్ పేర్కొన్నారు. బుధవారం ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందుమూల పరమేశ్వర్ రెడ్డి నాయకత్వంలో, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హెచ్.ఆర్. మోహన్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన యువతపై పోలీసులు దాడులు చేసి గాయపరచడం అత్యంత ఖండనీయమైన చర్య అన్నారు. ఈ నిరసనలో భాగంగా భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నిరసన వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా హెచ్.ఆర్. మోహన్ మాట్లాడుతూ, "ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రతి ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి తిప్పికొడుతుంది. నీట్ వ్యవహారంపై పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. యువత భవిష్యత్తుతో చెలగాటమాడిన వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మా పోరాటం రాజ్యాంగబద్ధంగా, గాంధేయ మార్గంలో నిరంతరం కొనసాగుతుంది. రాజీనామా జరిగే వరకు మా ఉద్యమం ఆగదు." అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు.



Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695